SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

లక్ష్మీనరసింహము, సెట్టి, 1881-1936

బప్పడు

విశాఖపట్టణము, 1912

Record no. 654

Lakṣmīnarasiṃhamu, Seṭṭi, 1881-1936

Bappaḍu

Viśākhapaṭṭaṇamu, 1912

Record no. 654

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

లక్ష్మీనరసింహము, సెట్టి, 1881-1936.
బప్పడు / సెట్టి లక్ష్మీనరసింహము.- విశాఖపట్టణము : బీ. రామయ్య అండు కో., 1912.
57, 3 p. ;17 cm.
Record no. 654

Lakṣmīnarasiṃhamu, Seṭṭi, 1881-1936.
Bappaḍu / Seṭṭi Lakṣmīnarasiṃhamu.- Viśākhapaṭṭaṇamu : Bī. Rāmayya aṃḍu kō., 1912.
57, 3 p. ;17 cm.
Record no. 654

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began: 22 January 2006

LAYS OF ANCIENT RAJASTHAN I.

BAPPA.

CETTY LAKSHMINARASIMHAM,
B.A., L.T.
Vizagapatam.

B. RAMAIYA & Co.,
VIZAGAPATAM.
VIZIANAGRAM & RAJAHMUNDRY.

[illegible] నరసింహవిరచితములు.

శ్రీరుక్మిణీకళ్యా[illegible]టకము 0- 8- 0
[illegible]నీవిజయ[illegible]నము (1912 ఇంటర్మీడియేటుకు
పఠనీయగ్రంథము) 0- 8- 0
శ్రీపురాణకథలు; మొదటిభాగము ... 0-12- 0
శ్రీపురాణకథలు; రెండవభాగము (1912 స్కూ-
లు ఫైనలుకుపఠనీయగ్రంథము) ... 0-12- 0
కృష్ణలీలాతరంగిణి (రసికాభిలాషవిమర్శనముతో) 0- 2- 0
సాధువాక్యములు 0- 2- 0

శ్రీవిక్రమదేవవర్మవిరచితములు.

శ్రీనివాసకళ్యాణనాటకము 0- 8- 0
మానవతీచరిత్రనాటకము, కాలికోబైండు (1908
ఎఫ్. ఏకు పఠనీయగ్రంథము ... 0- 8- 0
డిటో సాధారణప్రతి ... 0- 6- 0

మారేపల్లి రామచంద్రశాస్త్రి విరచితములు.

పారిజాతాపహరణనాటకము 0- 8- 0
బిల్హణీయనాటకము 0- 8- 0
కన్యాకాంచికావిజయనాటకము 0- 8- 0
మానవవిధి, తెనుఁగుసంధ్యావందనము ... 0- 4- 0
కథారత్నాకరము 0- 8- 0

ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణవిరచితములు.

రసపుత్రవిజయము (చరిత్రనాటకము) ... 0- 8- 0
చిత్రకథలు... ... ... 0- 6- 0

జల్లేపల్లి హనుమన్త్రాయకవివిరచితములు.

సునేనవిజయము (నాటకము) ... 0- 8- 0

బప్పడు.

సెట్టి లక్ష్మీనరసింహము,

బి. ఏ., ఎల్. టీ.

బీ. రామయ్యా అండు కో.,

విశాఖపట్టణము.

శ్రీ శారదామకుటముద్రాక్షరశాల,

విశాఖపట్టణము.

1912

శ్రీ లీలామానుష వేషమునను
బాలుడై తోడి బాలులను కూడి
వేడుకగ ఆట' లాడీ పాటలు
పాడీ క్రీడించిన శ్రీకృష్ణుడు
మా వేంకటరమణను శివరావును
వివిధముల కాపాడును గావుత!

అభ్యుదయపరంపరాభివృద్ధిగ
ఇటు నా సుతులకు దీవన' లొనర్చి,
వారూ వారల వంటి వారునూ
సరదా తోడను చదువుకొనుటకై
మాటాడి' నట్లె త్రేట తెనుగుతో
పాటగ వ్రాసితి బప్పని చరితము.

సెట్టి లక్ష్మీనరసింహము.

శ్రీ.

బప్పడు.

శ్రీ రాజస్థాన దేశమందలి
నాగేంద్రపురగ్రామములో గల
రాజకుటుంబపు చిన్ని బాలికలు
డోలిక' లూగుటకై పయన' మైరి

అట్లతద్ది అద్దినమునను గనుక
పొద్దుటనే చద్ది ముద్దలను తిని
ముద్దులు మురిపెములును కురిపించుచు
ఐదు వందలో ఆరు వందలో
పది పండ్రెం, డేడుల ఈడును గల
సిగ్గును తెలియని చిన్ని బాలికలు
వచ్చీ రానీ ఒయ్యారముతో
పెండ్లి కాకుండినా సరదాపడి
వడి వడి తోటకు నడువగ దొడగిరి.
గరగరలాడే పట్టు గాగరాల్

మిలమిలలాడే మేలిమి పైటలు,
రకరకములు గల మొకమలు రైకలు
ఇవె ఆ పిల్లల దుస్తులు; ఆ పై
గుండ్రని మొగముల కుంకుమ బొట్టులు,
కన్నుల నిండా కాటుక రేఖలు,
జడలలోన కురువేరూ దమనము,
చెవుల కొనల దుమికే జుమికీలూ,
పైటలపై తుళ్లే హారాలూ,
చేతుల గుత్తపు గాజుల తొడుగులు,
మొలలను గంటల ఒడ్డాణాలూ,
కాళ్లయందు చిరు మువ్వల అందెలు,
ఇట్లు వస్తువులతో ముస్తైబై
"వస్తారా" అని ఒండొరు పిలుచుచు,
గవ్వ గుత్తి వలె గలగలలాడుచు,
చిలుకల వలె కలకలమను వారూ
కిలకిల నవ్వుచు కేరేవారూ
పిల్ల లేళ్ల వలె గంతే వారూ
దారిలోని తూనీగలు బెదరగ
చిన్ని చప్పట్లు చరచే వారూ
గడ్డి పువ్వులను కోసే వారూ
అయి పదుగురేసి ఒక్కొక జట్టుగ
చెట్టాపట్టీలు కట్టుకొని తమ

ఊరి బయటి ఉద్యానవనములో
చొచ్చిరి ముచ్చటగా ఆ పిల్లలు.
చొచ్చి అచ్చటను విచ్చలవిడిగా
ఎచ్చటను చూచినా తామే ఐ,
వచ్చిన చోటికె వచ్చుచు తిరిగీ
పోయిన చోటికె పోవుచు మరియూ
తోట ఎల్ల ఎగిరి పోవు నట్లుగ
గొల్లున హాస్యపు మాటల' నాడుచు
హాస్యములకు పకపకమని నవ్వుచు
ఒండొరులను "ఓ" "ఓ" అని పిలుచుచు
తోట నడిమి మర్రిచెట్టుకిందకు
డోలిక' లూగగ బాలిక' లేగిరి.
చెట్టు కొమ్మ' కుయ్యాల కట్టుటకై
గట్టి తాడు ఎవతె తెచ్చెనో అని
అందరూ ఒక్కమారే అడిగిరి.
కాని అయ్యో పాపము! ఆ పిల్లలు
మాట సందడిని మనువు మరచి' నటు
ఆట సందడిని తాటిని మరచిరి.
ఆమె తెచ్చు' నని ఈమె తేకుండ
ఈమె తెచ్చు' నని ఆమె తేకుండ
మొత్తమునకు ఎవరూ తేకుండా
ఉత్త చేతులను ఊపుకొనుచు, ఎటు

ఉయ్యాల' లూగుటా ఊహింపకయే
ఉయ్యాల తాటిని తెచ్చుట మరచిరి.
అయ్యయ్యో అయ్యయ్యో పాపము!
ఉయ్యాల కట్టుట ఎట్లో తెలియక
చిన్నబోయి వాడిన మొగములతో
కన్నీరు తిరుగు కన్నుగవలతో
ఒండొరు మొగముల తేరి చూచుచును
పెదవులు తడుపుచు ఊర్పులు విడుచుచు
నేలపై బొటన వేళ్ళను రాయుచు
చేతులు తేలగ వేలంగ వైచి
నిలువబడి ఉన్నయట్టి సమయమున
ఆకసమునుండి ఉట్టిప' డ్డట్టు
ఆ తోటకు మెలమెల్లగ వచ్చెను
మచ్చ ఒక్కటీ లేక పాలవలె
అచ్చముగ తెల్లనైన ఒళ్ళుతో
వెడలుపు గల చక్కని మొగమ్ముతో
వెడదలైన కాటుక కన్నులతో
వాడి గలుగు వంగిన కొమ్ములతో
ఉబ్బుగా ఉన్నయట్టి పొదుగుతో
కామధేను' వన దగిన ఒక ఆవు.
ఆ గంగి గోవు అడుగుల వెంబడి
అడుగులను లెక్క పెట్టుచున్నట్లు

పెండ్లినడకలను నడుచుచు వచ్చెను
పెండ్లికొడుకు వలె కలకలలాడే
చక్కని నవ్వు మొగము గల వాడూ
చూడ చక్కనౌ సొగసుల వాడూ
నున్నబీరపై నూగు లాగుననె
నూగు మీసమును కలిగిన వాడూ
చిలకట్టూ మొలకట్టూ కట్టుక
చిన్నికృష్ణు వలె చేతను కోలను
గోవుల తోలగ పట్టిన వాడూ,
పదునైదేడుల ప్రాయంపు వాడు.
ఆ గొల్లవాని కనుగొని' నంతనె
చింత విడిచి చిన్న పిల్ల' లెల్లా
అటు తిరిగి ఒక్క గొంతుకతో "ఓ
బప్పా, ఓ బప్పా, ఓ బప్పా,
చప్పున ఇచ్చోటికి రావప్పా,"
అని తమ గొంతులు పగులగ అరచుచు
ఊడు' నటు చేతు' లూపుచు పిలిచిరి.
దగ్గర చేరిన బప్పని చుట్టూ
పువ్వుపై తేనెటీగల లాగున
మూగి ఆ పిల్ల' లెల్ల గొల్లుమని
"తాడు" "తాడు" "తా" డని రొద చేసిరి.
చేతి మునికోల గడ్డము కిందికి

ఊతగా పెట్టుకొని నిలువంబడి
పాదరసము నిండిన చిప్పల వలె
నవ్వున కలకలలాడు కనులతో
కన్నియల దిక్కు కనుగొని బప్పడు:
"తాడా? తా' డేటికి కావలయును?
సిగల జుట్టుకొనుటకు జడతాడా?
నడుములు బిగించుటకు మొలతాడా?
మగల మీ వలలలోన వేసికొని
గట్టిగా కట్టుటకు వలతాడా?
ఎట్టి తాడు కావలయును చెప్పుడి."
బప్ప' డీలాగు అడుగగానె విని
"ఉండరే" అనుచు తక్కిన పిల్లల'
నెల్ల మెల్లగా వెనుకకు తోయుచు
తక్కిన వారలకంటె ఆర్నెలలు
ఎక్కువ ఈడు గలట్టి చిన్నదీ
అందరి కంటె ఒకింత పొడవరీ
అందరి కంటె ఒకింత గడసరీ
గ్రామపు పెత్తనదారు కూతురూ,
పన్నా అన్నట్టి ఒక్క చిన్నది
ఒక మూ' డడుగులు ముందరకు వచ్చి
కాడ మీద ఒక కొంచెము వంగిన
తామర వలె మొగ' మించుక వంచుక

బప్పని దిక్కుకు తిరిగి నిలువబడి:
"బప్పా, ఎపుడూ హాస్యాలేనా?
ఇప్పుడు నే' చెప్పే మాటలు విని
చెప్పిన లాగున చేసి పెట్టితే
తప్ప' కుండ నీకు పుణ్యా' మబ్బును.
ఇది అట్లతదియ ఎరుగుదువు గదా"
అన విని బప్పడు మాట' కడ్డమై
"అమ్మాయీ, ఇది అట్లతదియ అని
ఎట్లు నేను ఎరుగుదు' ననుకొంటిరి?
అట్లు గాని ముక్క గాని ఒక్కటి
పెట్టిన పాపమున పోయినారా?
'బప్పా,' 'బప్పా,' అని మీ' రిప్పుడు
చరచిన చప్పట్లు తప్ప మరి ఏ
చప్ప' ట్లయినా పుల్ల' ట్లయినా
తినుమని నా చేత పెట్టినారా?
అవసరమునకు కావలసిన బప్పడు
ఆరగింపునకు అక్కర లేదా?
పోనిండు, ఇంతయే కద మీ దయ!
చెప్పండీ నే' చేయగ వలసిన
సాయ' మెట్టిదో చేసి పెట్టెదను"
అని ఎగతాళిగ పలికిన బప్పని
వైపు చూపి పన్నా "విన్నారా

ఈ బప్పని గడుసుదనపు మాటలు?
బప్పా, మే' మేల నిన్ను మరతుము?
ఎప్పు' డేది మేము నిన్ను కోరిన
తప్పకుండ చేసి పెట్టు చుందువు;
ఎప్పటి దయ ఇప్పుడు చూపెట్టుము.
అట్లు నీకొరకు అట్టె ఉంచితిమి.
మరి నా మాటకు అడ్డుగా రాక
చెవి ఒగ్గి వినుము జాగ్రత్తతోడ.
అట్లతదియ ఈ దినమున గావున
ఉయ్యాల' లూగగ వలె' నని ఇచటికి
ఉబలాటముతో మేము వచ్చితిమి;
కాని రావలె' నటన్న సందడిని
ఉయ్యాల తాటిని మరచి వచ్చితిమి"
అన విని బప్పడు పకపక నవ్వుచు:
"వహ్వారే! వహ్వారే! వహ్వా!
పెండ్లికుమారుని మరచి దిగవిడచి
పెండ్లికి పోయిన పేరటాండ్రవలె
ఉయ్యాల తాటిని మరచిపోతిరా?"
అన పన్నా కోపముతో: "బప్పా,
మమ్మ గేలి చేయుటయే గొప్పా?
ఊరక నవ్వుచు నిలుచుటె మెప్పా?
తాడు తెచ్చి పెట్టుటయూ తప్పా?

చేత' నైన ఈ సాయము చేయుము;
లేనియెడల నవ్వును కట్టిపెట్టి
నూరాడక నీ దారిని పట్టుము"
అన బప్పడు నవ్వుచు: "ఓపన్నా,
కోపము నాపై చూపెద' వన్నా!
పెట్టుకొన్న బొట్టు చిట్లి పోవగ
కన్నుబొమలు ఏటికి ముడివైవగ?
తాడు మరచి వచ్చిన మీ పరాకు
విని నవ్వగ ఏటికి ఈ చిరాకు?
మీకు సహాయము చేయ' నంటినా?
తాడు తెచ్చి పెట్టక పోయెదనా!
కాని దాని' కొక్కటె షర' తున్నది.
తెచ్చినట్టి తక్షణమే నాచే
తాడు మీరు కట్టించుకో వలెను"
అన్న మాటలకు పన్నా: "బప్పా,
ఇప్పుడు నీ తెలివికి నవ్వుదుమా?
నీవు తాడు కట్టి పెట్టకుంటే
ఎట్లుగ మేమీ చెట్టుపై' కెక్కి
కొమ్మలకు తాడు కట్ట గలుగుదుము?"
ఇట్లుగ పన్నా అన్న మాట విని
బప్పడు: "అమ్మాయీ, నవ్వోదరా?
నవ్వాండ్డీ, మి' మ్మెవ్వ' రడ్డెదరు?

నవ్వు మీ మొగములకు సింగారము
కావున మరీ మరీ నవ్వండీ.
కాని నా అభిప్రాయము మాత్రము
మీకు తెలిసినట్లే కనిపించదు.
చెట్టు కొమ్మలకు ఉయ్యాల తాటిని
కట్టుట నా ఉద్దేశమే కాదు;
'కొమ్మ'లైన మీ మెడలకే తా' డో
అమ్మాయీ, నే' కట్టెద' నంటిని.
ఇందుకు మీ' కందరకూ సమ్మతి
ఐతే చెప్పండి, తాడు తెచ్చెద."
ఈ మాటలు విన్నంతట పన్నా
తక్కినట్టి పిల్లలతో కూడా
సిగ్గుచే మొగము కొంచెము వంచెను.
బప్పడు వదలక, "బాలికలారా,
ఇప్పుడె పెండ్లి కొమార్తెల చొప్పున
మొగములు సిగ్గున వంచెద' రేలా?
లెండీ, ఈ సిగ్గును వదలండీ,
పెండ్లి చేసికొందము చెప్పండీ,
బృందావనమున మందలు కాచిన
గోవిందుడునూ గొల్ల సుందరులు
కూడి వేడుకగ రాసక్రీడలు
ఆడినట్లు మనమూ జతకూడుక

ఆడుకొనిన త' ప్పేమీ? రండీ."
బప్పని పలుకులు విని ఆ పిల్లలు
వారిలో వారు ఒకరితో ఒకరు:
"ఔనే, ఓసీ, ఏ' మంటావే?
త' ప్పేమే?" "అబ్బబ్బే! పోవే,
ఎవ' రైనా వింటే ఇక ఉందే?
సిగ్గు సిగ్గు!" "అటు కాదే వినవే
వట్టి అబద్ధపు పెండ్లియే కదే?
ఎవరు చూడ వస్తా' రీ మూలకు?
ఉస్తి ఆకునో విస్తరాకునో
పుస్తె కట్టినంతటనే ఈతడు
వాస్తవముగ మన మగ'డౌతాడా?
మన'మీతని పెండ్లాల' మౌదుమా'
ఇది ఒక వేడుక పొద్దుపోవుటకు,
ఇక లేవే," "ఐతే కానీవే,
నలుగురితో చా' వైనా పెండ్లియె,"
అని విసవిస ఒక దెసకు ముసరుకొని
వెస గుసగుస' లెసగగ పసిపిల్లలు
ముసిముసి నవ్వులు నవ్వుచు బప్పని
కొసరు చూపులను చూచుచు నిలిచిరి.
వారి అభిప్రాయమును కని పెట్టి
బప్పడు వా' రక్కడనె నిలువబడి

చూచుచున్న యంతలోన తిరిగి
దిట్టమైన గట్టి తాడు పట్టుక
వచ్చి, "ఇదిగో, తెచ్చితి మీ అరిణము,
మరి ఇక ఆలస్యము చేయకండీ,
పెండ్లిముహూర్తము మించిపో వచ్చె
పెండ్లికొమార్తెలు కండీ వేగమె"
అని చిరునవ్వును నవ్వుచు నిలిచెను.
ఆపై జరిగిన వేడుక వేడుక.
ఆనందము ఆనందము ఆయెను:
శ్రీరాముని వంటి పెండ్లికొడుకూ,
సీతమ్మ వంటి పెండ్లికూతులూ,
ఇక ఏటికి ఆనందము కలుగదు?
లక్ష్మీ కల్యాణము ఒక భాగ్యమె?
గౌరీకల్యాణము సౌభాగ్యమె?
ఇదియే భాగ్యము; ఇదె సౌభాగ్యము.
బంగరు బొమ్మల పెండ్లిండ్లు తరుచు
చేసే ఈడున ఉన్న ఆ చిన్ని
బంగరుబొమ్మల పెండ్లి ఎవ్వరికి
ఆనందము కలిగింపక ఉండును?
ఆ వేడుక చూడగ ముచ్చట పడి
గాలికి పైకెగయుచున్న తీగెలు
నిక్కి నిక్కి కనుగొనగా సాగెను.

ఆకుల చాటున ఒదిగిన పూవులు
తొంగి తొంగి చూడంగా సాగెను
మైనలు కాకాతువ్వాలు, గువ్వలు,
పావురాలునూ, కోవిలపిట్టలు,
చిలుకలు, సీతాకోకిలచిలుకలు
"రండీ, బప్పారాయుడి పెండ్లిని
చూడ బోవుదము రండీ" అటంచు
సంతోషముతో ఎగురుచు వచ్చెను.
ఆ పిల్ల' లెల్ల ఉల్లాసమ్మున
పూవులలోపలి పచ్చనిపొడితో
బప్పని ఒంటికి నలుగులు పెట్టిరి.
దొండపంటి ఎఱ్ఱని రసంబుతో
బప్పని మొగమున బొట్టును పెట్టిరి.
చీకటిచెట్టుల ఆకులను పిడిచి
ఆ పసరుతోడ బప్పని బుగ్గను
దృష్టి పోవుటకు చుక్కను పెట్టిరి.
ఎఱ్ఱని పచ్చని పూవులు గుత్తిగ
చేర్చి ఇటూ అటు తీగెలను కట్టి
పదిలముగ అదే బప్పని నుదుటను
పెండ్లి బాసికముగాగను కట్టిరి.
తీవెలపై గుమగుమమను పూవులు
కోసి దండలుగ చేసి కొన్నిటిని

బప్పని మెడ హారాలుగా వేసి
కొన్నిటి సిగపై సొగసుగ చుట్టిరి.
ఇటు బప్పడు పెండ్లికొడుకు కాగా
తా' మల్లె పెండ్లికూతు' ళ్లగుచును
ఎవ్వతెకు మొదట పెండ్లియొ తెలియక
ఎవతె మట్టు' కదియే సిగ్గుపడుచు,
"నీవే" "కాదే, నీవే," "నీవే
నాకంటె పెద్దదానవు కావే?
"చిన్నదాని ముద్దే కానీవే,"
"ఇది ఎక్కడి సబబే? పోపోవే,"
అని ఒకరొక్కరి ముందుకు తోయుచు
ఒక్కొ'క్కడుగును వెనుకకు వేయుచు
వంతులు తెగక ఒకింత తగవుపడి
అంతా ఒక మారే పెండ్లాడగ
అంతట వా'రొప్పుదలను పొందిరి.
ఆమీద వివాహము మొదలయ్యెను.
దట్టముగా కొమ్మలతో కమ్మిన
చెట్టే పెండిలి పందిరి ఆయెను.
రంగుల పువ్వులు రాలిన నేలయె
ముగ్గులతో పెండ్లితిన్నె ఆయెను.
జుంజుమ్మను తుమ్మెదల మోతయే
ఢంఢమ్మను బాజా ధ్వని ఆయెను.

ఆడు కోకిలలు పాడిన పాటలె
పేరటాండ్రి పెండ్లిపాట'లాయెను.
చిలుకలు గొల్లుగ పలికిన పలుకులె
బాపలు చదివిన మంత్రము'లాయెను.
మీదినుండి జలజలమని రాలే
పచ్చని పువ్వులె అక్షత'లాయెను.
పూవులను పెట్టి కట్టిన తీవెలు
ఒక్కొక్కటిగా బప్పడు తీయుచు
అందరిలోపల ముందుగ తనకుడి
పక్క కూర్చున్న పన్నాబాయికి,
అటుమీద ఎడమ వైపున కొంచెము
ఎడముగ కూర్చున్న చిన్నదానికి,
ఆవెనుకను ఆ వెనుక దానికీ,
అటుపై అటుపై ఉన్నదానికీ,
తరవాతను తరువాతి దానికీ,
ఇట్లె ఆ ఆరు వందల మందికి
మెడలపై అన్ని తీగెపుస్తెలను
జడ' లడ్డకుండగా తప్పించుచు
మూడు ముళ్లు వేసికొనుచు వెళ్లెను.
బప్పడు తిరిగి వచ్చి కూర్చొండ
బాలిక' లెల్లా ఆతని చుట్టూ
గుండ్రముగా కూర్చొండి వేడ్కతో

అంతకు ముందే కోసి కుప్పగా
పోసినట్టి సన్నజాజి మొగ్గలు
దోసిళ్ల కొలది తీసి తా' మతని
శిరసు మీద తలబ్రాలుగ పోసిరి.
ఆరు నూర్ల దోసిళ్ల మొగ్గలూ
ఊపిరి సలుపక యుండ ఒకమారె
కుమ్మరించు ఆ అమ్మాయిలతో
చాల లేక తల ఒగ్గి తటాలున
బప్పడు లేవంగ బాలికలునూ
గబాలుమటంచు లేచి నిలువబడి
ఒకరొక్కరి చేతులను పట్టుకొని
చంద్రుని చుట్టూ గాలిగుడి లాగు
గొలుసు కట్టి చక్కని వరుసలతో
పాటలు పాడుచు చుట్టూ తిరుగుచు
తెయ్యి తెయ్యిమని నాట్యము చేసిరి.
సంతోషముతో ముఖము వికసిల్ల
బప్పడు కొమ్మల' కుయ్యాలను కట్టి
ఒక్కొక్కరి తన ఒడిలో పెట్టుక
"ఉయ్యాలో, జొంపాలో," అటంచు
ఊపున బాగుగ ఊగసాగెను.
మొగముమీద చిరుచెమ్మట్లు కమ్మగ
గాలిచే పయట కొంగపై' కెగర

బంగరు జడ వీపున నటింపగా
ఊగినంత సేపూ ప్రతి పిల్లా
కిలకిలమని నవ్వుచునే ఉండెను
క్రిందను నిలుచున్నయట్టి బొట్టెలు
చిన్ని కృష్ణుపై ఉయ్యాల పాటను
కూర్చి సన్నగా పాడుచు నుండిరి.
ఆ పాటను పాడుచుండ ఒకచో:
"పెయ్యల వెంబడి బృందావనమున
చయ్యన చొరబడి సరసముగ గొల్ల
ఒయ్యారులతో వెయ్యారు గతుల
సయ్యాటల' నాడిన నల్లయ్యా,
ఉయ్యాల' లూగర ఓ కృష్ణయ్యా,"
అన్న ముక్కలను విన్నంతటనే
బప్పడు చప్పున ఒడిలో పిల్లను
దించి గబాలున నేలపై' కురికి
నాల్గు దిక్కులూ కలయగ కనుగొని:
"సెలవు కొత్త పెండ్లములారా!" అని
చేయి వీచి పరుగున పోబోయెను.
పక్కనె నిలుచున్నయట్టి పన్నా
లాగీ లాగని లాగున ఆతని
చెంగును దొంగతనముగా లాగెను.
దానికి బప్పడు నవ్వుతో నిలిచి

"ఆహా! ఏమీ! అప్పుడే మీరు
పెండ్లాడిన అధికారము పూర్తిగ
చూప తలచుకొన్నారా? ఏన్నా,
కొంగు ముళ్లతోనే మగవారల
స్వాతంత్ర్యము సంపూర్తిగా పోయి
పెండ్లాముల దాసులు కావలెనా?
అట్లే మీ చూపులకు కట్టుబడి
ఆగియుండు' నన్నా వీలు లేదు.
నాగవల్లి నిష్ఠుర' మనగా ఇదె;
అయినా కోపింపక సెల' వొసగుడు"
అన ఒక చిన్నది: "ఏమే? ఏన్నా,
మాటలు రావే? అడుగగ లేవే?
నోటిలో కుడుము పెట్టుకొన్నావె?
అంత కొంప మునిగిన పని ఏమో!"
అన బప్పడు: "ముద్దుల పెండ్లామా,
కొంపయే కాదు, కొంప కంటెనూ
ప్రాణము కంటెను హెచ్చగు పరువే
నే నిప్పుడు పోకుంటే పోవును.
నా వెంట వచ్చినట్టి ఆ ఆవు
నిన్న మొన్న అటుమొన్న ఏ
హేతువో కాని వట్టి పోయినది.
ఎవరు దొంగతనముగ తోటలలో

పితుకుకొని పోయినారో తెలియదు.
ఇంటివారి అనుమానము మాత్రము
అన్యాయముగా నాపై తగిలెను.
చవితి చందురుని చూచితి' నేమో!
కృష్ణుపై శ్యమంతకమణి గురించి
కలిగిన లాగున దొంగ' నటంచును
నాకూ నీలాపనింద కలిగెను.
అది తీర్చుకొనే ఉద్దేశముతో
దొంగ' నెట్లయిన పట్టుకొనుటకై
పోవుచు, ఇచ్చట జాలము చేసితి.
ఇపుడు మీరు నా పెండ్లా' లగుటను
నా పరువూ మీ పరువే కావున
సెలవు ఇచ్చి దయతో పంపించుడి.
అన్నట్టు, మరొక మాట మరచితిని:
వేడుకగా మన' మిక్కడ ఆడిన
ఆట మాట పొరపాటున మీ మీ
ఇండ్ల వద్ద చెప్పెదరు సుమండీ!
అది మీ మనసులలోనె ఉంచుడీ.
కొంచె' మైన పై' కుబికిన' దంటే
ఇక్కడ జరిగిన పెండ్లి అబద్ధము,
ఇండ్ల వద్ద వేప బెత్తములతో
జరిగే పెండ్లి నిబద్ధి కాగలదు,"

అని చిరునవ్వును నవ్వుచు బప్పడు
కదలి తోట దాటి వెళ్లి పోయెను.
కనబడు చున్నంత సేపు పిల్లలు
ఆ వైపే చూచుచు నిలువంబడి
అటుపై మెలమెల్లగ చింత విడిచి
ఉయ్యాల' నెక్కి ఊగగ సాగిరి.

అట బప్పడు ఎటు ఆవు పోయెనో
ఎరుగక మనమున పరిపరి విధముల
తలపోయుచు, ఆవు నడక జాడల
బట్టి చెట్ల నీడలు గల తోటల
లోన ఉన్న బాటల' కడ్డముగా
అల్లిబిల్లిగా అల్లుకొనినట్టి
మల్లె మొల్ల విరజాజి తీగెలను
మెల్ల మెల్ల తప్పించుకొనుచు, ఎటు
చీమ చిటుక్కు' మటన్న తటుక్కున
తిరిగి చూచి అటు ఆవు లేకున్న
మనసు చివుక్కున పొక్కుచుండగా
మనుజుల సంచారము మున్నెరుగని
లోపు జీబు వనమునందు చొరబడి,
అక్కడి పిట్టలు తపతప రెక్కలు
కొట్టుకొని హఠాత్తుగ పై' కెగిరే

చప్పుడులకు తులుకుపడుచు, ఈతలు
తుమ్మలు బలురక్కసులూ మొగలులు
డొంకలుగా పెరిగిన చిట్టడవిని
దూరి సూది ముండ్లకు వెత చెందుచు
పోయి పోయి, తల మీదకు సూటిగ
పొద్దు మింటిపై చేరిన యప్పుడు,
ఎండకు భయపడినట్లు నీడలు
చెట్టుల మొదళ్ళ చేరినయప్పుడు,
తాపముచే వాచిన రెక్కలతో
చప్పుడు లేకుండ పిట్ట' లన్నీ
ఆకు జొంపములు దూరిన యప్పుడు
నుదుటి చెమట ఊడ్చుకొనుచు బప్పడు
చిట్టడవికి చిట్టచివరి తట్టున
చెట్టుచేమ' లట్టే పుట్ట' నట్టి
మెట్ట ఒకటి ఎట్టయెదుట చూచెను.
ఆ మెట్ట నట్టనడుమ తట్టునను
తెరచిన పెనుభూతపు నోటి వలెనె
దట్టపు చీకటి కమ్మి ఉన్నట్టి
కడు వెడల్పు గుహా కనబడె ఎదుటను.
ఆ భూతము నోటను వేసికొన్న
నరజీవుల పేగులు పోగులు వలె
తీవెలు గుహాలో అల్లుకొని ఊగెడె.

భూతము చిరుగుర్రి పెట్టి' నట్లే
గుహాముఖము హోరుమనుచునుండెను.
అడుగుల జాడల బట్టి చూడగా
ఆవు గుహాను చొచ్చి' నట్లు అగపడె.
సాహసించి దానిలోన చొచ్చుటో,
తిరిగి వచ్చిన దారి పట్టుటో,
తోచక బప్పని మది తహతహ పడె.
"ఏ పుట్టలోన ఏ పా' ముండునొ!
మోక్షము కొరకై ఆశించి పోవ
మొసలి ఎత్తుకొని పోయి' నట్లుగా
ఆవుకు తెగించి గుహాలో చొరబడ
పురుగో బుట్రో పొడుచునో కదా!
నీలాపనింద పాపుకొనుటకై
గుహాలోపల చొరబడిన కృష్ణునకు
ఎలుగుగొడ్డు డాపరించ లేదా?
అట్లే ఇప్పుడు తటస్థ' మైతే
ఎటు తప్పించుకొనంగా వచ్చును?"
అని ఇటు బప్పడు తటపటాయించి
తటుకున మదిలో దిటవు తెచ్చుకొని,
"కానీ, నా' కీ వట్టి బితు' కేల?
అడవుల మార్గాలల తిరుగాడే
పసుల తోలు పిల్లల కాపాడే

శ్రీకృష్ణుడు నా పాలను కలుగగ
చింత గాని భయము గాని ఏలా?
'కాళియు' డను పాము మదము తొక్కిన
కరుణాత్ముడు నా పాలను కలుగగ
పాములు న' న్నేమి చేయ జాలును?
జాంబవంతు బల' మంతా అణచిన
శక్తిశాలి నా పాలను కలుగగ
ఎలుగుగొడ్డు' లేమి చేయ జాలును?
కొండ వా' టొసగి గొల్లల కాచిన
గోపాలుడు నా పాలను కలుగగ
కొండ గుహాను చొరగా భయ' మేలా?"
అని గుహాముఖమునందలి తీగెల
తెమలించుచు దానిలోన చొరబడి
కారు కమ్ముకొన్న కటిక చీకటి
కనులు కాన రానియట్లు చేయుట
అడు' గడుగుకు అడుగులు తడబడ కడు
తడుముకొని నడువగా నడువంగా
అంతలోన ఆ పై గుహాలోపల
ఏ రంధ్రములోనుండి చొరబడెనొ
కాని చిమ్మ చీకట్లు మూలలకు
తోసి వేసి ఏ' డెనిమిది మూరల
కై వారపు జాగా వెలిగించుచు

ఇంచుకంత వెలుతురు కనిపించెను.
ఆ వెలుతురులో బప్పని తప్పిన
ఆవు బొమ్మ లాగున నిలువంబడి
పొదుగునుండి ఎడ తెరిపి లేకుండ
ఆకాశగంగ ధారల తీరున
కారుచున్న స్వచ్ఛంపు పాలతో
నేలపై ఉన్న ఒక లింగమునను
అభిషేకము కావించుచునుండెను.
భూమిలోనుండి నిలువుగ మొలిచిన
బూడిదగుమ్మడి పండు వంటి ఆ
శివలింగమును కనుంగొని బప్పడు
భక్తిచే ఒళ్ళు పులకరించగా:
"హరా హరా, మహాదేవా, శంభూ,"
అని భూభాగముపై సాగిలపడి
నొసలు నేలపై పూర్తిగా మోపి
మూడు మారులూ మొక్కిన పిమ్మట
మోకరించి కూర్చుండి ఇటూ అటు
కనులు తిప్పి తన పక్క నేలపై
కృశించి కృశించి ఎముకల పోగై
శవమేమో అనిపించే వానిని,
ఒళ్ళెల్లా నరములు తేలుటచే
ఊసర వెల్లిని పోలే వానిని,

కోడపళ్ళ వలెనె గోళ్ళెదుగుటచే
పిట్టలాగు కనుపట్టే వానిని,
గడ్డమూ మీసమూ ఒంటిని గల
వెండ్రుకలూ తలపై వెండ్రుకలూ
నిడుపుగా పెరిగి నెరసి ఉంటచే
పత్తిరాశి వలె అగపడు వానిని,
అర ముగ్గినట్టి ఒక్క మౌనిని
చూచి ఆశ్చర్యపడి భయభక్తులు
మనసులో నిండ ఆ ముని ధ్యానము
పాడు కాకుండ నిశ్శబ్దముగా
ఊపిరి బిగబట్టి చుట్టుపట్లను
చూడంగా, శివలింగము వెనుకను
మూడు నాల్గు మూరల దూరములో
కత్తులు కటార్లు శూలములు గదలు
పట్టుకొన్న ఎన్నో చేతులతో,
మెడ చుట్టూ గుత్తులముగ కూర్చిన
పుర్రెలతో, ఎర్రగ వేలాడే
నిడుపు నాల్కతో, నిప్పులు కణకణ
కురిపించే కన్నులతో, నిగనిగ
మెరయుచు కనుగొను జనముల మనముల
భగభగమనిపించే మొగమ్ముతో,
కాలి కింద పెను రక్కసు తొక్కుచు

ఒక్క దుర్గ విగ్రహము కనంబడె.
ఆ దుర్గకు ఎదురుగ ఒక రాయీ
రాతి మీద ఒక పొడవగు కత్తీ
కత్తి పక్క ఒక కవచము ఉండెను.
వీటికి బప్పడు వింతపడుచుండ
అంత ముని కనులు విప్పి కనుంగొని:
"బప్పా, నీ వెవ్వడవు? ఇచ్చటికి
ఏలాగున వచ్చితివో చెప్పుము.
ఈ గుహాలోపల వెలసి ఉన్న ఈ
ఏకలింగేశ్వరుని సేవింపగ
నా వంటి మునులు తప్ప మరెవరూ
తెగించి ఇచటికి ఎప్పుడూ రారు.
ఇట్టి రహస్యపు స్థలము గనుక నే
నేను వచ్చుటకు కారణ మైనది,"
అని ముని అడుగగ సాష్టాంగము పడి
లేచి చేతులను కట్టుక బప్పడు:
"ఓ స్వామీ, మీరలు సత్యఋషులు;
పిల్లవాడ నను ఉద్దేశముతో
"బప్పా" అని నను పిలిచితిరి గదా!
అట్లుగానె నా పేరూ బప్పడె.
ఈ మెట్టకు చేరువున ఉన్నట్టి
నాగేంద్రపురమె నే నున్న ఊరు.

ఆ ఊరిలోని రాచవారలకు
పసులకాపరిని, జాతికి గొల్లడ.
తల్లీ నేనూ బ్రదుకుచున్నాము.
ప్రతిదినమూ ఆవులను తోలుకొని
వచ్చి ఈ అడవియందు మేపుదును.
ఇదిగో ఇక్కడ ఉన్న ఈ ఆవు
వట్టి పోయి ఇల్లు చేరుచుండుట
బట్టి నాకు అపనింద ఘటిల్లెను.
ఇట్టి నీలాపనింద పాపుకొన
ఆవు వెంబడిని వచ్చితి నిచటికి.
ఇందు మూలమున ఐనా స్వామీ
మీ దర్శన మైనది, నే ధన్యుడ."
ఈలాగున పలికిన ఆ బప్పని
మాటలలో కలిగిన పొందికయూ
నడవడిలో కనబడు అడకువయూ
అవయవంబులందలి పొంకమునూ
ముఖమునందు తోచే తేజమునూ
చూచి అతడు గొల్లవాడు కాడని
అనుమానముపడి అతనితో: "ఓ
బప్పా, నీవినయమునకు మెచ్చితి,
కోరుకొన్న వరమును నీ కిచ్చితి
కోరు," మనగ మునికి మొక్కి బప్పడు:

"ఓ మహానుభావా, మీ దయచే
ఏమీ లోపము లేదు దాసునికి;
అయినా మీరలు కోరుమన్నపుడు
కోరకుంట అపచారము కావున
ఒక్కటి మాత్రము వేడెద, తెలుపుడు.
ఆ దుర్గాదేవి విగ్రహమునకు
ఎదురుగ కుదురుగ ఉన్న రాతిపై
కత్తీ కవచము ఏటికి ఉన్నవి?
ఈ మారుమూల గుహాలోపల ఈ
దుర్గా శివలింగము ఎటు పుట్టెను?
తెలుపుడీ," అనిన బప్పనితో ముని:
"కుర్రా, విను, రాజపత్ని ఒక్కతె
తన మగని శత్రురాజులు చంపగ
అప్పటికి నిండు చూలాలై తా
నుండుటచే ప్రాణములు విడువగా
లేక ఈ గుహాను దూరి దీనిలో
దాగి ఉండి పొద్దులు నిండగా
అడవి జంతువులె మంత్రసానులుగ
పురుడు పోసికొని మగపిల్లని కనె.
గుహాలో పుట్టిన హేతువు చేతను
గుహుడను పేరు ఆ పిల్లనికి కలిగె.
ఆ పిల్లవాడు అంతై ఇంతై

అంతలోన యౌవనవంతుండై
తల్లి వల్ల వృత్తాంతమెల్ల విని
శత్రుల సాధించే కోరికతో
ఇక్కడ ఈ లింగమును స్థాపించి
పెక్కేండ్లు తపము చేసీ సిద్ధిని
పొందలేక తన ముసలితనంబున
ఈ దుర్గను నెలకొల్పి ఇక్కడనె
పూజింపగ గుహామాత ఆ గుహుని
పుత్రునిగా భావించి ఈ గుహనె
సాక్షాత్కరించి ఇట్లని పలికెను:
"పుత్రా, వృద్ధుడవై పోవుటచే
శత్రులను నీవు సాధింపలేవు.
ఇక ముందుకు నీ వంశములోపల
వీరుడొకడు జన్మించి మీ పగను
తీర్చి రాజ్యమును తిరిగీ పొందును.
ఇదిగో, ఇది ఒక కత్తి, దీనితో
రాళ్ళయినా సమసిన తెగిపోవును.
ఇది ఒక కవచము, ఎట్టి కత్తితో
నరికినా గాని నరుకును పడనిది.
ఈ రెండూ ధరియించు వీరునకు
అపజయమన్నది ఎపుడూ కలుగదు.
అట్టి వీరుడిక వచ్చేవరకూ

వీటిని నీ' విక్కడనే ఉంచుము.
మీ వంశములో వారికే తప్ప
ఈ కత్తిని ఎత్తే బల' ముండదు;
ఈ కవచము కూడా సరిపోవదు,"
అని దేవి చెప్పినట్టి చొప్పుననె
వీటిని గుహు' డిక్కడనే విడిచెను.
నాటినుండి ఈ కత్తీ కవచము
ఎందో' రెందరో ఎన్నో విధముల
కదప బోయినా కదలినవి గావు,"
అని మునీశ్వరుడు తెలిపిన సంగతి
విని బప్పడు వింత పొంది: "ఏమీ!
ఈ కత్తి ఎత్తుటే అసాధ్యమా?
చూత," మని బాల్యచాపల్యముచే
దుర్గ' కెదురుగా చని ఒక మొక్కును
మొక్కి కత్తి పిడి పట్టి ఎత్తగా
బోవ,——అయారే! ఎంతటి వింతయో!
ఏన్గు తొండమున చెరుకు గడ వలెనె
తేలికగా కత్తి లేచి వచ్చెను.
చేతికి వచ్చిన కత్తి పట్టుకొని
తెల్లబోయి బప్పడు నిలుచుండెను.
ఆశ్చర్యముచే కన్నులు విడగా
ముని తటాలుమని లేచి నిలువబడి:

"తొడుగు, తొడుగు, కవచంబును తొడుగుము,
గుహావంశములో వాడవే కాని
గొల్లపిల్లడవు కా' వో బప్పా,
వంశపు పగ తీర్చి నీవు తిరిగి
పూర్వుల రాజ్యము సంపాదింపుము,"
అని చెవిలోపల దుర్గామంత్రము
ఉపదేశించి, "కుమారా, నీ' వీ
మంత్రము నిత్యము పఠించుచుంటే
శత్రుజయము తప్పక సిద్ధించును,"
అని చెప్పి వింత చే కా' ళ్ళాడని
బప్పడు తను చూచుచుండగానే
గుహాలోపలి వైపునకు మెల్లగా
వెళ్ళి వెళ్ళి అచట మాయ' మాయెను.

అంతట బప్పడు నిద్రలోనుండి
తుళ్ళిపడి' నట్లు తెలివి తెచ్చుకొని
కవచమును తీసి తొడుగుకొనంగా
కొల చూచిన లాగే సరిపోయెను.
కవచము తొడిగిన అంతనె వింతగ
ఆకాశము వర' కెదిగి' నట్లుగా
కవచము పట్టక ఉబ్బి' నట్లుగా
ఊహాలు మదిలో ఇముడ' నట్లుగా

కొత్త ధైర్యమూ కొత్త సత్తువా
కొత్త ఉత్సాహమూ మొలకెత్తెను.
ఇంటి వద్ద తల్లినల్ల సరిగా
పుట్టు పూర్వోత్తరములను తెలిసే
తొందరచే కాళ్ళు నేల మోపక
గాలిలో నడుచుచున్నట్లుగనే
నడచి, గుహ వెడలి, పై చిట్టడవిని
గడచి, ఆ మీది తోట దాటి, తన
ఊరి చేరువకు చేరినంతలో
పడమట పొద్దు గబాలున కుంకెను
అంబా అని అరచుచు ఆవులెల్ల
ఊరివైపు నడచి పోవుచుండెను.
కొలకొల కొలకొల కూయుచు పిట్టలు
గూళ్ళ కడకు చేరుకొనుచునుండెను;
చెట్ల ఆకులను జలజల కదల్చి
లేత వాయువులు వీచుచునుండెను;
ముసుగు వలె మసక చీకటి క్రమముగ
దెసలయందు అంతటనూ నిండెను.
కనుమూసిన ఆ చీకటిలో బడి
ఊరికి ఈవల ఉన్న తమ గుడిసె
కడకు చేరి బప్పడు ఒక ఇంచుక
తట్టగానె తల్లి ఓరగిలగా

తలుపు తెరచి తమ గుమ్మము ముందట
మడిమలనుండీ నడినెత్తి వరకు
కవచముతో ఉన్న వింత రూపము
కాంచి, "బప్ప' డింటను లే," డటంచు
తటుకున తలుపును మూయబోవగా
"అమ్మా, నేనే, బప్పడనే," అని
పలికి లోపలికి ప్రవేశమయ్యెను.
వచ్చిన బప్పని వంక ఎగాదిగ
కాళ్ళనుండి తలవరకూ పూర్తిగ
చూచి తల్లి తల ఊచుచు: "ఓరీ
బప్పా, ఇది ఏమి వాలకమురా?
ఎక్కడిది కవచమురా ఇది? చెప్పర.
దీని వలన ఇంకేమి మునుగునో?
ఈ పొద్దుట ఊరి బయటి తోటను
నీవు జరిగించి నట్టి దానికే
ఊరెల్లా గగ్గోలుగ ఉన్నది.
నీవేమో ఆ తోటలో రాచ
కన్నియలకు తాడు కట్టినావట!
ఔరా! ఇది ఎక్కడి విడ్డూరము!
కన్నె కట్టుటకు రాజులకన్నెలు
ఆవులా దూడలా అనుకొన్నావో?
వారికి కట్టిన తాడే ఇప్పుడు

నీ గొంతుకే కురితాడయ్యెగదా!
ఆ పిల్లలు ఇండ్లకు రాగానే
గ్రామపు పెత్తనదారు కూతురిని
అడుగగ పై గ్రామపువారెవరో
వచ్చి, సంబంధమును కుదుర్చుకొని
లగ్నము పెట్టుటకు పురోహితులను
పిలువ వారు గృహములను లెక్కించి
ఆ పిల్లకు నేడే రహస్యముగ
పెండ్లి అయిపోయెనని తెలుపంగా
ఆ సంబంధము చెడి పోయినదట!
తోక తొక్కినట్టి పాము లాగున
లేచి పిల్లదాని తండ్రి పిల్లను
నొక్కి రొక్కించి రొక్కించి అడుగ
బిక్క మొగము పెట్టుక ఆ చిన్నది
వెక్కి వెక్కి నీ సంగతి అంతా
ఉన్నదున్నట్లు తెలిపి వేసెనట!
ఏమిరా బప్ప ఇంత ఆగడము?
రాజులతోనా సరసాలాడుట?
రాచ పగ అన్న తాచు పగ గదా!
నీ ప్రాణము పుచ్చుకొన్న వరకూ
వారి కన్నులకు నిద్ర పట్టునా?
నలుబది మందియో ఏబది మందియో

వచ్చి నిన్నడిగి పోయినారురా.
నీకు చావు తప్పదురా, కొడుకా.
ఇప్పుడు కత్తీ కవచమూ నీవు
రాగా ఎవడో రాజనుకొంటిని;
ఎట్లు కాచుకొందుర నిను కొడుకా,"
అని ఏడ్చే తల్లి వైపు కనుగొని:
"అమ్మా, నాకై అడలగ బోకే,
నాకిప్పుడు వచ్చిన భయమేమే?
రాచవాడననుకొంటిని అంటివి;
నిజముగా రాచవాడను కానా?
రాజపుత్రకుడనే ఐనప్పుడు
రాజపుత్రికల పెండ్లియాడుటకు
నేను తగిన వాడను కానా మరి?
నీ వెంతటి భద్రముగ దాచినా
నిలుకడ మీదను నిజము తేలినది,"
అని కనులు వెళ్లబెట్టిన తల్లికి
గుహలో జరిగిన ముచ్చటలెల్లా
పూస గుచ్చినట్లుగ వినిపింపగ
విని కనుకొలకులనుండి కాల్వలై
పారుచున్న కన్నీళ్లతో ఆమె
పులుకు పులుకుమని చూచుచు బప్పని
కవచము మాటే పూర్తిగా మరచి

కౌగిలించికొని, "కుర్రా, బప్పా,
చిన్నవాడ" వని ఇన్ని నాళ్లునూ
చెప్పకుండ నీ సంగతి దాచితి.
దాచక ఇక అంతా చెప్పెద వినుః
పూర్వము మన రాజస్థానమునకు
వల్లభీపురము ముఖ్యపట్టణము.
ఆపట్టణమును ఒకానొకప్పుడు
శిలాదిత్యు డను రా జేలుచుండె.
అతడు సూర్యవంశములో పుట్టుటె
కాక, సూర్యునికి ముద్దుకుమారుడు.
పరరాజులు తనపై కెపుడైనా
దండెత్తి వచ్చుటను వినగానే
పురము నడుమ నున్న సూర్యగుండము
కడ కా రాజేంద్రుడు వడివడి చని
సూర్యమంత్రము జపించు; జపించి
నిలుచుండగ ఆ గుండము గుండా
సూర్యుని ఏడు ముఖంబుల గుర్రము
పైకి వచ్చు; అది ఎక్కి ఆరాజు
పోరు సలుపగా అతని ముందటు
సూర్యుని కాంతికి మంచు విరిసినటు
శత్రు సైన్యములు చెల్లా చెదరగు.
ఈ లాగున ఎదురు లేని వాడై

నేల నాల్గు చెరగులు కూడా తన
పలుబడికి లోబడి ఉన్నట్లుగ
పరిపాలనము చేయు చుండగా
ఆ కాలమందు కాబూ లేలే
చిత్తుఖాను ఆ రాజోత్తమునకు
ఓడి పోయి పగ సాధించుటకై
శిలాదిత్యు మంత్రులలో ఒకనికి
లంచ మిచ్చి గుట్టుమట్లు కనుగొని
ఆ గుండములో ఆవుల కొవ్వును
కలిపించి దాని మహిమను చెరిపెను.
చిత్తుఖాను ఈ మారు దండెత్తి
రాగా ఎప్పటివలె రాజేంద్రుడు
సూర్యమంత్రము తగ జపించినా
మునుపటివలె గుర్రము రాకుండుట
చూచి తన చావు దగ్గర పడెనని
తలచి శత్రు సైన్యములపై కుదికి
దొరికినట్లు తునకలుగ నరికి నరికి
పిరికితన మెరుగని ఆ వీరుడు
వీరస్వర్గమునకు వేంచేసెను.
సహగమనమును కోరి రాజభార్యలును
అగ్నిని పడి జోహారు గావించిరి.
మొండెపు తునక వల్లభీపురిలో చేరబడి

కొల్ల బెట్టి దగ్ధము కావించిరి.
వల్లభీపురము వల్ల కాడుగా
మారుటచే చిత్తుఖాను చేరువ
కొండ మీద చిత్తూరను దుర్గము
కట్టి అచట రాజ్యము స్థాపించెను.
యుద్ధమునాటికి నెల తప్పి ఉన్న
యట్టి శిలాదిత్యుని పట్టమహిషి
పుట్టింటినుండి తిరిగి వచ్చుచు
దారిలో మగని చావు విని బెగడి
కారడవులలోనికి పారి పోయి
ఈ నాగేంద్రపురమునకు దగ్గరి
కొండ గుహను దాగియుండి అంతట
నెలలు నిండగా కొడుకును కనియెను:
ముని చెప్పిన గుహుడే ఆ బాలుడు.
ఆ గుహుడు పెద్దవాడై ఎరుకుల
కూడి ఇచటి ఏడూరికి రాజై
తండ్రి శత్రువులపై పగ తీర్పగ
తంటాలను పడి పడి మృతి పొందెను:
ఇది నీవు విన్న అంశమే గదా.
ఆ గుహు సంతతి పుట్టిన వారలు
ఏడు తరములే డూరి పురములో 825
ఏలి పగ తీర్ప లేక గతించిరి.

ఎనిమిదో తరము వాడై పుట్టిన
విజయాదిత్యుడె సుమి నీ జనకుడు!
చిత్తూరి తురకలూ మీ వంశము
పై పగ బట్టిన వారె కాబట్టి,
నీవు పుట్టినట్టి కొన్ని నాళ్ళకు
అడవులలోనికి వేటకు పోయిన
నీ తండ్రి నచట చాటుగ చంపిరి.
నిన్నూ చంపుదురన్న బితుకుచే
కన్నులు పీడని చిన్నతనముననె
ఏడూరి నుండి నాగేంద్రపురికి
ఎరుకుల సాయముతో నిను తెచ్చితి.
తెచ్చి, ఇచట గొల్ల పిల్లవానిగ
రాజపుత్రదేశచక్రవర్తిని
నిన్ను నా కంటి పాప కంటెనూ
ఎక్కువగా చూచుచు కాపాడితి.
బాబూ, బప్పా, చెప్పక తప్పని
సంగతి ఒక్కటి ఉన్నది వినుమా.
నీకు నేను తల్లిని కాను సుమీ!
నిన్ను కన్న తల్లీ జీవింపక
మగనితోడ సహగమనము చేసెను.
నీతల్లికి నే దాదిని తండ్రీ,
నీవు నాకు కొడుకువు కావు సుమీ!

నా ప్రభుకుమారుడవు, నా ప్రభువు.
కడుపున కనలేదను మాటె కాని
కన్న కొడుకు కన్నా మిక్కిలిగా
కన్నులలో నిన్ను పెట్టుకొంటిని.
ప్రాణ మెల్ల నీ పైనే బాబూ.
తల్లిని కానన్నట్టి సంగతిః
వినగానె ప్రేమ విడిచి నన్వదలి
పోవుదు వేమో అన్న బెంగచే
ఇన్నాళ్లూ ఈ గుట్టు దాచితిని.
ఇక నన్నేలాగున చూచెదవో,
నీ దయయే నా తండ్రీ బప్పా,"
అని నోటను మాట రాక నిలిచిన
పెంపుడు తల్లిని కనుగొని బప్పడు
కన్నుల గిర్రున తిరిగే నీళ్లను
గ్రుక్కుకొనుచు డగ్గుత్తికతో "ఓ
తల్లీ, ఇట్లుగ పల్కెద వేమో?
నా తల్లివి నీ వేటికి కావే?
నీ కొడుకును నే నేటికి కానే?
ఎవరు నన్ను కనిరో ఎరుగను గద.
కన్న తల్లి చనిపోవగ దయతో
కన్న తల్లి వీవే నా తల్లివి.
తల్లి వన్నట్టి మాటే ఏమీ?

తల్లీ తండ్రీ లేకున్నప్పుడు
తల్లివై తండ్రివై కాచుటచే
తల్లివి నీవే, తండ్రివి నీవె,
ఆపై నా దైవమువూ నీవే.
నిన్నెట్లు చూతునో అననేలా?
మునుపటి కన్నా మక్కువతోనూ
ప్రాణము కన్నా ఎక్కువగానూ
నిన్ను చూచుకొందును నా తల్లీ.
ఆ లేని పోని అనుమానములను
మానసమున పెట్టుకొనుట మానుము.
అంతే కాక నా పెండ్లి గురించీ
అనవసరముగా అడలగ బోకుము.
నీ ఆరు నూర్ల కొత్త కోడదడ్రి
తలిదండ్రులతో మన వృత్తాంతము
వివరముగ తెలిపి వియ్యము నడుపుము.
చిత్తూరుకు రాజైన వెంటనే
మీ అల్లుడు తన పెద్దలనెల్ల
పిలిపించుకొనుట నిశ్చయ మటంచు
వారితో తెలుపగదవే తల్లీ!
ఇక నేనా చిత్తూరు రాజ్యమును
ఎట్టి రీతిగా సంపాదించుటో
ఆది ఆలోచింప వలసి ఉన్నది.

ఎరుకుల సాహాయ్యము లేకుండా
సాధించుట అన్న వట్టి మాటే.
ఎరుకులు నాకెక్కడ దొరుకుదురో?
దొరికినా తోడు పడుదురో, లేదో?"
అని ఆందోళన పొందే బప్పని
చూచి దాది: "అబ్బాయీ, బప్పా,
ఇందు గూర్చి నీవు చింత పడకుము.
ఏడూరిచటికి ఏడో ఆరో
కోసుల దూరముననే ఉన్నది గద;
ఆ ఏడూరికి తూరుపు దిక్కున
చిక్కిరి బిక్కిరి దారులు కలిగిన
కొండ కోనయే ఎరుకుల వాసము.
అచ్చటకు నీవు చని నేనిచ్చే
బూరతోడ ముమ్మారూదగనే
ఎరుకులెల్ల వచ్చి నీకు లోబడి
నీవేమి చెప్పినా నెరవేర్తురు.
ఇట్లు చేయుటకు ఒట్టు పెట్టుకొని
నన్నిచటికి దిగబెట్టిన ఎరుకులు
నాకు బూరనొకదానిని ఇచ్చిరి,"
అని దాది పుట్టుపూర్వోత్తరముల
నెల్ల విప్పి బప్పనితో చెప్పెను.
ఆ రాత్రి ఎల్ల బప్పని మనస్సు

పళ్ళెరమున పాదరసములాగే
పలు పోకలుగా పరుగెత్తుటచే
కన్నులపై రెప్ప పడదయ్యెను.
ఎంతటిలోపల తెల్లవారునో,
ఎంతట ఏడూరును చేరుదునో,
ఎంతటిలో ఎరుకులు దొరుకుదురో
ఎంతలోన తురకల నరుకుదునో,
ఎంతటిలో చిత్తూరు చొత్తునో,
అని చిత్తము తత్తరపడుచుండగ
అంతలో కొక్కొరోకో అటంచు
తొలి కోడి కూత వినగా వచ్చెను.
తన అంతము దగ్గర పడుటెరిగిన
విధమున దీపము వెలవెల పోయెను.
చెట్లను పిట్టలు కొంచెము కలకల
కదలి అంతటనె కూరుకు చెందెను.

కోడి కూత చెవి పడినంతటనే
తటాలు మటంచు లేచిన బప్పడు
అన్ని సరంజాములూ సిద్ధమై
పెంపుడు తల్లి అనుజ్ఞను కైకొని
పైకి పయనమై వచ్చినంతలో
భళ్ళున తెల్లవారుచు నుండెను.

ఊరి వెలుపటికి చేరి'నప్పటికి
తూర్పున పొద్దు పొటుక్కున పొడిచెను.
కుదురు గలుగు ముదురు కెంపు బంతిని
పోలుచున్న ఉదయసూర్యబింబము
మెల్ల మెల్లగా మీదికి ప్రాకెను.
చెట్ల మీదనూ గడ్డి మీదనూ
ముత్యముల వంటి మంచు తుంపురులు
సూర్యకిరణములలో తళతళమని
వజ్రపు పొడు'లేమో అనిపించెను.
సగము నీడలో సగ'మెండలోన
ఉండుటచే కొండ'లెల్ల సరిగా
అర్ధనారీశ్వరుల వలె కనబడె.
దారిలోన జలజలమని పారే
సెలయేళ్ల నీళ్లు తుళ్లుచు ఎండను
తళతళమని మెరయుటచే, ముదమున
కిలకిల నవ్విన లాగే తోచెను.
ఈ వింతలు'కొక్కటికీ కన్నులు
లేక తన మహాలోకములోనే
మునిగి కేవలము ముందు చూపెగా
బేగిరా' వడుగులతో బప్పడు
జామున్నర పొద్దెక్కిన లోపున
ఏడూరి తూర్పుకోనకు చేరెను.

చేరి అచట తన చేతను పట్టిన
ఇత్తడి బూరను ఎత్తి నోటితో
చెవులు గియ్యుమను'నట్లు గట్టిగా
మూడు మారులూ ఊది నిలువగా
మరి ఒక గడియకు చుట్టునూ ఉన్న
పొదలు, లోననుండియె ఒక కొంచెము
వీడగా, అట్లు కలిగిన అందలి
సందులలో మసి రాసిన తీరున
కారు నలు'పగు వికారపు మొగములు
నలు వైపులకూ బెదరు చూపులను
చూచుచు బూచుల లాగున తోచెను.
పొద'లన్నీ కన్నులుగా వన'మిటు
బెదరు చూపులను చూచుచుండగా
అంతలోన ఒక పొదనుండి వెడలి
నిట్ట తాటి వలె నిడుపగు వాడూ,
కాటుక కన్నా నల్లని వాడూ,
పిడి కుచ్చు వంటి సిగ గలవాడూ,
కరకు మీసమును కలిగిన వాడూ,
కణకణమని చింత నిప్పు'లట్లే
మెరయుచున్న మిడిగుడ్లవాడూ,
నల్లరాతి పలక లాగు దృఢమై
చాల వెడ'ల్పగు ఛాతీ వాడూ,

సాము కసరతులు చేయుట చేతను
కండలు కట్టిన దండల వాడూ,
ముడుకుల నుండీ మొల వరకూ కడు
గట్టి బట్ట ఎగగట్టిన వాడూ,
పదను పెట్టి ఉన్న గండ్రగొడ్డలి
భుజము మీద వేసికొన్న ఎరుకుల
రేడు తిన్నగా ఇటు అటు చూడక
బప్పని వైపుకు వచ్చి నిలువబడి:
"జియ్యా, బూరను ఊదుటచే నిను
విజయాదిత్యుని కొడుకుగ ఎరిగితి.
నీ తండ్రి తాతల రీతిగ మా
జాతి' కెల్ల నీవే ఇక రేడువు.
నేనూ నా ఎరుకులునూ తప్పక
నీ' వేమి చెప్పినా చేసెద," మని
చేతులు కట్టుక నిలువగ బప్పడు:
"ఎరుకు నాయకా, ఏమి చెప్పుటకు
ఏ' మున్నది? నా తండ్రిని చంపిన
తురక మీద కసి తీర్చుకొనుటకూ
చిత్తూరు రాజ్యమును పొందుటకూ
మీరునాకు సాయము కావలయును.
ప్రాణ' మున్న వరకూ ఈ బప్పడు
మీరలు చేసే మేలును మరువడు,"

అనగా ఎరుకుల పెద్ద బప్పనికి:
"జియ్యా, మా చేత' నైన సాయము
చేయుటలో ఏమీ వెనుతీయము.
కాని నీవు తలపెట్టిన కార్యము
అసాధ్య' మేమో అని నే' తలచెద.
చంద్రునిలోపలి మచ్చను పట్టిన
వాడు తప్ప పైవా' డెవ్వడునూ
మీ తండ్రిని చంపిన ఆ డౌలతు
ఖాను ప్రాణములు తీయగ లేడని
ఫకీ' రొకడు మునుపు చెప్పినా' డట!
ఎక్కడి చందురుడు? చంద్రునిలోపలి
మచ్చను మనుజులు పట్టుట ఎక్కడ?
అట్టివాడు తను చంపుట ఎక్కడ?
అని నిశ్చింతగ ఆ మొరకు తురక
దేవూ నై గురువూ నై అన్నటు
మిట్టిమిట్టి పడుచున్నాడు గదా!
అట్టివాని ఎటు చంపగ వచ్చును?"
అన బప్పడు: "ఓ ఎరుకు నాయకా,
ఫకీరు చెప్పిన వికారములు ఏ
ప్రకారముగ నిజ మనుకొంటివొకో!
ఫకీర్లు బికార్లు పలికిన మాటల'
కకారణముగా అడలిపోదుమా?

తురక దైవ'మగు చంద్రుని లోపలి
మచ్చ వెనుక దాగున్నా సరియే
గడ్డము పట్టుక ఈడ్చుకొని వచ్చి
డౌలతుఖానుని డాస్‌డౌలత్తులు
మంటను కలుపక ఎట్లూ విడువను.
ఫకీరు మాటకు భయపడు' టేటికి?
ఈ కత్తీ ఈ కవచమూ నాకు
ఉన్నంత వరకు గెలుపే కలుగును.
జంకు విడిచి ఓ ఎరుకు నాయకా,
చిత్తూరుకు మరి పయనము కమ్మా,"
అనిన ఎరుకు: "జియ్యా, చిత్తూరుకు
పయనము కా' నక్కర లే' దిప్పుడు.
ఆడబోయి' నట్టి తీర్థ' మెదురై'
నట్లే దౌలతు ఈ కోనలోన
ఇక్కడికి కర కోసెడు దూరములో
వేటలాడుచున్నాడు; అల్లదే
మెలికలు మెలికలు గాగ చుట్టుకొని
మీదికి పొగ లేచుచున్న చోటే
ఆ ఖాను గాడి గుడార' మున్నది.
ఖానుతోడ మాటాడగ వచ్చితి'
నని వాని చేరి ఆ సమయమునకు
ఎట్లు వీ'లగునో అట్లుగ నడువుము.

మేమూ నీతో చాటు చాటుగా
తుప్పనుండి పై తుప్పకు దాటుచు
తప్పక వత్తుము; బప్పారాయా,
ఎప్పుడు బూరను నీ' వూదెదవో
అప్పుడే వచ్చి సాయ' మొనర్తుము,"
ఇట్లు చెప్పి ఆ ఎరుకు నాయకుడు
వెనుకకు చని తిరిగి పొద దూరెను.

తిన్నగా తురక' లున్న దిక్కునకు
మొగ' మై బప్పడు పోవ పోవగా
పావు కోసు దూరమున అటునుండి
వేటకుక్కలూ గుర్రపు రౌతులు
వెనుకనుండి కేకలతో తరుమగ
తిరిగి చూచుటకు తెరిపి లేక తన
ముందరి కాళ్లను ముందరకూ మరి
వెనుక కాళ్లు వెనుకకూ పూర్తిగా
చాపి ఒంటితో సమానముగ తన
పొడుగు చెవులు రిక్కించి నేలపై
కాలును మోపక గాలిలోపలనె
మెరపు లాగు పరుగెత్తుకొని వచ్చి
చెవులపిల్లి ఒక్కటి ఆ బప్పని
కాళ్లలోన పడి గజగజ వడకుచు

మూతి అతని కాళ్లమీద పాముచు
కన్నీరు కారు కనులు పై కెత్తి
జాలిగా మొగము వంకను చూచెను.
మనసు కరిగి బప్పడు: "ఓ శశమా,
రా'జన శశియూ అర్థము కావున
రాజును కాబోవుచున్న నా కడ
చేరితివా?" అని చప్పున అదియే
చంద్రునిలో మచ్చ అన్న సంగతి
మనసులో తట్టగా గతుక్కుమని
ఆశశమును పట్టి ఎత్తి అంతట
చేరిన జాగిలములను తోలగా,
ఆ పై నక్కీ తలపాగాలూ,
గుడ్డ గుండీల అంగరఖాలూ,
పట్టి ఉన్న షుర్వాలూ, మొలలకు
కట్టి ఉన్నట్టి రంగు రుమాళ్లూ,
కత్తిరింపు గడ్డాలూ తామూ
తురక రౌతు' లే తెంచి అదేదో
కీసర బాసర బాసతో పలికి,
"దేవుడే" వనుచు కేకలు వేసిరి.
ఏది దేవుటో ఎట్లు దేవుటో
ఎరుగక బప్పడు: "ఏమి దేవవలె?
మీప్రాణములను దేవవలయునా?"

అనగా తిరిగీ అయోమయముగా
ఏమోమో అని తురకలు: "జల్దీ
ఆవు, ఆ" వనుచు అల్లరి చేసిరి.
"జల్డి ఏమిటో? ఆవు ఏమిటో?
చల్ది తిని ఆవు తోలు'మందురో?
ఆవుల కాపరి' నని ఎటు ఎరిగిరి?"
అనుకొని బప్పడు ఆ తురకలతో:
"ఆవుల తోలుట నే' మానుకొంటి;
ఆవుల వలె మీ తురకల' నెల్లా
తోలు" మనిన తోలెద," నన తురకలు
తిరిగీ ఏదో అరువగ, "ఆహా!
తుద కబ్బెర తురక భాష అన్నటు
ఇది ఎక్కడి ఘోష వచ్చె?" ననుకొని,
"ఖాను దగ్గరకు వచ్చెద," నటంచు
బప్పడు సైగలచే చూపించెను.
చుట్టుముట్టి వా' రెల్లా తనతో
రాగా, మరి కొంత దూరమును చని
అక్క' డొక్క చెట్టు క్రింద బప్పడు
డౌలతుఖాను గుడారము కాంచెను.
కొంత సేపటికి ద్విభాషి ఒక్కడు
"ఖానుగారి హుకుమైనది ర," మ్మన
వానితో గుడారము లోనికి చని,

అక్కడ పట్టు హిజారూ, మొకమల్
కబ్బా, జరీ బుటా పని టోపీ
ధరించి సోఫా మీద సాఫుగా
కాళ్ళు చాపి, పాము మెలిక' లట్లుగ
చుట్టుకొన్న తెగ బారెడు హుక్కా-
గొట్టము నోటను పెట్టుక గడగడ
గుడగుడ' మనిపించుచు, తీగెలలో
పొగమంచు వలెనె గడ్డము లోపల
కమ్మి వెడలు పొగ నడుమను ఎర్రని
కన్నులు నిప్పుల వలె కనిపించగ
బప్పడు డౌలతుఖానును చూచెను.
దుబాసి చెవిలో: "నబాబు సాబుకు
సలాము పెట్టు," మనంగా బప్పడు:
"గులామునా నే' సలాము చేయగ?
సలామూ లేదు గిలామూ లేదు,"
అని బోర విరచి నిలువ బడంగా,
అంతట మబ్బుల మాటున వినబడు
గురగుర' మను' నట్టి ఉరుము లాగున
పొగ వెనుకనుండి డౌలతు మాటల
చప్పుడు బప్పని చెవిలో పడియెను.
దుబాసి బప్పనితో: "ఓ కాఫర్,
సర్కార్ రౌతులు తరిమే జంతువు

ఏల పట్టితివి? ఎవ్వడ'? వని సా
సర్కార్ సాహేబ్ అడుగుచున్నారు,"
అనిన విని: "సాయెబయ్యా, నేనే
విజయాదిత్యుని కుమారకుండను,
మీ సర్కారుకు మారకుండనూ.
చంద్రుని లోపలి మచ్చవంటి ఈ
చెవులపిల్లినే' పట్టక పోతే
చెవులు పట్టి మీ సర్కార్ గొంతుక
కోయుట సాధ్యము కా' దని పట్టితి,"
అని బప్పడు చెప్పిన ఆ జబాబు
నబాబు తోడ దుబాసి తడబడుచు
చెప్పగ వాడు తులుక్కు పడి లేచి,
"అరే, అరే, అల్లా, అల్లా!" అని
జడుపుచేత కడు గడగడ వడకుచు
గుడాకు కాయ దడాలున పడగా
గుడారమందుండి వెడలి వడి వడి
పరుగెత్త బోవ బప్ప' డడ్డుపడి,
ఒకటే నరుకూ రెండే తునుకలు
కాగా డౌలతుఖాను శిరస్సును
కస్సున ఖడ్గముతో తెగ నరికెను.
జేనెడు మీదికి సరిగా ఎగిరిన
ఖానుగాడి తలకాయ గాలిలో

గిరగిర గిరగిర మొగ్గలు కొట్టుచు
దెబ్బన చివరగు దిగువను పడియెను.
చిమ్మనగొట్టముతోడ వసంతము
కొట్టి'నటు ఖాను గొంతుక వెలువడి
బుస్సున నెత్తురు ధారలు లేచెను.
"అయ్యో! నవాబ్ మర్గయా," అటంచును
దుబాసి సాహెబు తోక తెంచుకొని
ఒకటే దూకుగ పైకే దూకెను.
ఇంతట బప్పడు బూర ఊదగా,
"ఉరుకు," "ఉరుకు," "నరుకు," "నరుకు," మంచును
ఎరుకులు కెవ్వున కేకలు వేయుచు
మొరకు తురక మూకల మీది' కురికి
కరకు గండ్రగొడ్డండ్లతో వంట
చెరుకును నరికిన కరణిని నరికిరి.
నెత్తురు వరదలు కట్టి'నట్టి ఆ
నేల మీద కుప్పలుగా తురకల
గడ్డపు తలకాయలు పడి, గిరిన
తాటి టెంక' లట్లే కనుపట్టెను.
తురక కళేబరములపై దుస్తులు
తీసి దులిపి ఎరుకలూ బప్పడూ
చిత్తూ' రెట్లుగ సాధించుటయో
ఆలోచన చేయుచుండ, అంతట

నాగేంద్రపురములోని క్షత్రియులు
మనబప్పని మామలూ బావలూ
దాది వల్ల సంగతి ఎల్లా విని
అతనికి సాయము చేయుద' మటంచు
బయలుదేరి వచ్చుచున్న వారలు
ఆసమయంబునకే బప్పనితో
కలిసికొని, అతడు చెప్పిన చొప్పున
తురక వేసములు వేసి అందరూ
కూడి హుటాహుటిగా చిత్తూరికి
చీకటి పడు'నంతకు చేరుకొనిరి.
చిత్తూరు కాచు పారా బంటులు
చీకటి వలనా దుస్తుల వలనా
తమ నవాబు దండే వచ్చిన'దని
నగరపు తలుపులు బారుగ తెరచిరి.
ఆటంకము లేకుండా ద్వారము
దాటి కోటలోపలికి చొరబడి
అచ్చటి రక్షకభటులను చీల్చి,
ఆదమరుపుగా ఉన్న సైన్యములు
శూన్యములుగ నాశనము కావించి,
బప్పడూ అతని తోడివారునూ
చిత్తూరి పురపు కోటను పట్టిరి.

పురి లోపల గల హిందూ జనులకు
ఆ రాత్రి ఎల్ల దీపావళియే!
రాజపుత్ర దేశమందు తిరిగి
రాజపుత్రకుల రాజ్యము వచ్చిన
దని ఎటు కనుగొనినా వేడుకలే,
ఏ దిక్కు చూచినా తెయితక్కలె,
ఏ వైపున విన్నా డబడబలే,
ఏ పక్క పోయినా గుబగుబలే!
వాడవాడలందు అమ్మలక్కలు
కూడి బుగ్గలను వేళ్ళు పెట్టుకొని:
"విన్నా వటె ఈ ముచ్చట, అక్కా?
శిలాదిత్య వంశములో పుట్టిన
గుహుని తొమ్మిదో తరము వాడటే!
బప్పరావట"! అన ఇంకొక్కతె:
"చెల్లీ, పదునైదేండ్ల వాడటే!
ఆరు వందల అమ్మాయిల మగడట!"
అన మరి ఒక్కతె: "వదినా, శశమును
పట్టి, అదే చంద్రునిలోని మచ్చ
కావున డౌలతుగాడిని చంపెను;
శశము వలన అభ్యుదయము పొందిన
ఇతని వంశము 'శశోదయ' మగు నట!"
అన వేరొక్కతె: "మరదల, వింటివె?

ఈయన పెంపుడు తల్లీ, ఆపై
ఇతని ఆరు వందల పెండ్లాలూ,
నాగేంద్ర పురమునుండి పయనమై
రేపె వత్తు' రట! ఇక ఎల్లుండే
బప్పరాజు పట్టాభిషేక మట!
అప్పుడు నే నీ చొప్పున పాడెద,
విను," దని ఆ సతి పాడగ సాగెను:

"కుప్పలు కుప్పలు పెండ్లాలను గల
బప్పారాయా, నీకు మంగళము.
అప్పరమేశ్వరిచే కత్తి గొనిన
బప్పారాయా, నీకు మంగళము.
గొప్ప బలము గల తురకల కూల్చిన
బప్పారాయా, నీకు మంగళము.
తప్పక చిత్తూరును సాధించిన
బప్పారాయా నీకు మంగళము.

సంపూర్ణము.

యతిప్రాసతత్త్వనిర్ణయము ...	0- 2- 0
శ్రీ ఆంగ్లేయభారతవర్షము	0- 1- 6
శివోద్వాహము (నాటకము) ...	0- 6- 0
మెట్రిక్యులేషనువిద్యార్థులకు వ్యాకరణము, ఛందస్సు.	0- 1- 0
స్త్రీవిద్యాభ్యాసము	0- 2- 0

బులుసు పాపయ్యశాస్త్రివిరచితములు.

పద్యరత్నభాండాగారము (4, 5 ఫారములకు పఠనీయముగా నంగీకరింపఁబడినది)...	0- 6- 0
తెలుఁగు వ్యాకరణము-(నవీనమార్గమున రచింపఁబడినది)	0- 6- 0
అజ్ఞాతవాసము (4 తరగతికి పఠనీయగ్రంథము)	0- 4- 0
పిల్లలకొఱకు పద్యములు	0- 0- 9
భాసరాగవిలాసము (నవ్యవచనము, మనోహరము, నీతిబోధకము) తగ్గించినవెల ...	0- 2- 0
భామినీవిలాసము- పండితరాయకృతశ్లోకములకు తెనుఁగుపద్యములు	0- 4- 0
కర్మఫలము	0- 0- 6
వసంతయామినీస్వప్నము (నాటకము) ...	0- 8- 0

చిలకమర్తి లక్ష్మీనరసింహవిరచితములు.

పారిజాతాపహరణము (నాటకము) ...	0- 8- 0
గయోపాఖ్యానము (నాటకము)	0- 8- 0
సౌందర్యతిలక (రెండుభాగములు) ...	1- 0- 0
హేమలత	0- 8- 0
అహల్యాబాయి	0- 8- 0
రామచంద్రవిజయము	0- 8- 0

కర్పూరమంజరి (ప్రథమభాగము) ...	0-12- 0
రాజస్థానకథావళి (ప్రథమభాగము) ...	0-12- 0
,, (రెండవభాగము) ...	0-12- 0
ప్రసన్నయాదవము (నాటకము)... ...	0- 8- 0
మహాపురుషుల జీవితములు (ప్రథమభాగము)	0-12- 0
,, (రెండవభాగము)	0-10- 0
,, (మూడవభాగము)	0-12- 0

ఇతరగ్రంథములు.

జయంతజయపాలము (నాటకము)...	0- 8- 0
పీష్వా నారాయణరావు వధ (నాటకము)	0- 6- 0
కృష్ణార్జునచరిత్రము (మంత్రిప్రగడ సూర్యప్రకాశకవిప్రణీతము, ద్వ్యర్థికావ్యము) ...	0- 8- 0
రసికాభిలాషము శృంగార (శ్రీనాథప్రణీత శృంగారగ్రంథము	0- 2- 0
మొల్లరామాయణము	0- 8- 0
ఆంధ్రమహాభాగవతము (రెండువాల్యములు) ...	4-12- 0
భర్తృహరి (ఆంధ్రటీకాతాత్పర్యములతోను, ఏనుగులక్ష్మణకవికృతాంధ్రపద్యములతోను)	2- 0- 0
మనుచరిత్రము	1- 8- 0
భాస్కరరామాయణము (చక్రనిఘూర్ప)	2- 8- 0
ఆముక్తమాల్యద, (సటీక. అట్టబైండు) ...	2- 8- 0
వసుచరిత్ర, సటీక. (దళసరి కాగితములు చక్రనిఘూర్ప)	2- 8- 0
కళాపూర్ణోదయము (దళసరి కాగితములు) ...	1- 8- 0

చర్చివార్డు,
విశాఖపట్టణము. } బీ. రామయ్య అండు కంపెనీ.

END OF
TITLE